అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
మంగళవారం 09 మే 2023

పలువురు ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ - కౌటాల

మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన బెండారె నాందేవ్, బెండారె రాజు ఇద్దరు అన్నదమ్ముల ఇండ్లు షాట్‌సర్క్యూట్‌తో కాలిపోగా సోమవారం సహాయ సంఘం దాతలు రూ.15 వేలు, వంద కిలోల బియ్యం బాధిత కుటుంబాలకు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, పలువురు కలిసి బాధితులకు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం, బట్టలు, వంట సామాన్లు, దుప్పట్లు ఆర్థిక సాయంగా అందించారు. అదేవిధంగా నిల్వ నీడలేక తల్లడిల్లుతున్న బాధిత కుటుంబాలకు కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ ప్రవీన్‌కుమార్, మా ఫౌండేషన్ వ్యవస్థాపకులు లోడెల్లి ప్రవీన్ ఆర్థిక సాయం అందజేశారు. పోలీసుల తరపున క్వింటాళ్ల బియ్యం, నిత్యవస్తువులు, బెడ్‌షీట్లు, దుస్తులు, తార్పాలిన్లు, మా ఫౌండేషన్ వారు రూ.12 వేల నగదు, ఇతర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, పోలీస్ సిబ్బంది, మా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా జిఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ రాజా రమేష్ మిత్ర బృందంతో పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. లక్ష్మీ గణపతి ఆలయంలో హనుమాన్ భక్తులకు అన్నదానానికి క్వింటాల్ బియ్యం, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గణేష్‌నగర్‌లోని ఆటో డ్రైవర్ వినోద్‌కు 25కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం డాక్టర్ రాజా రమేష్ బాబు మాట్లాడుతూ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ఇలా సేవ కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆకినపల్లి సురేష్, మహేష్, భూతగడ్డ రమేష్, ఉదయ్, సాయి, రాజ్‌కుమార్, పప్పు రాజు, వంశీ, కిషోర్, హరి పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకొచ్చిన సంకె రవి కుటుంబ సభ్యులు



నవతెలంగాణ-కాసిపేట

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి- రాజకుమారి తమ 24వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తన తల్లి కీశే లక్ష్మి, సోదరుడు కీశే శ్రీనివాస్ స్మృతిలో అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా కుటుంబ సభ్యులందరూ అవయవ దానానికి ముందుకొచ్చారు. సంకె రవితో పాటు భార్య సంకె రాజకుమారి, పిల్లలు సంకె ప్రణయ్ కుమార్, సంకె శ్రీనిత తమ మరణానంతరం సోపతి వెల్ఫేర్ సొసైటీ- జైపూర్ సహకారంతో సదాశయ ఫౌండేషన్‌కు అవయవ దానం చేయడానికి ఒప్పంద పత్రాలను అందజేశారు. ఆదివారం సోమగూడెం(కె) ట్యాంక్ బస్తీలో పెళ్లి రోజు సందర్భంగా మరణానంతరం కూడా పది మందికి ఉపయోగపడాలని ఈ చేస్తున్నామని తెలిపారు. సామాజిక బాధ్యత కల్గిన కుటుంబం అవయవ దానానికి ముందుకు రావడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోపతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు భీమ్‌పుత్ర శ్రీనివాస్, అవయవ దాతల సంఘం సభ్యులు సి.బాబ్జి, వినయకుమారి, లక్ష్మి, శ్రీచరణ్, శ్రీభాషిణి, మౌర్య, శౌర్య, లక్ష్మి, సుశాంతి, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబాల ఓదెలు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వైద్య శాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎమ్‌లను క్రమబద్ధీకరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2వ ఏఎన్ఎంలు అనేక కష్టాలను ఎదుర్కొంటూ, గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వారి సేవలు గుర్తించడం లేదన్నారు. వైద్య శాఖలో సాధారణ సేవలు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేసి నిరంతరం సేవలు చేస్తున్న వారిని రెగ్యులర్ చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, గిరిజన ఆశ్రమాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో సమ్మె చేసే దిశగా ప్రయత్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, జిల్లా నాయకుడు కృష్ణమాచారి, రెండవ ఏఎన్ఎంలు సంతోషి, సునీత, పుష్ప, పరమేశ్వరి, దివ్య భారతి, సునంద, గోధుబాయి, పుణ్య బాయి, సునీత, భాగ్య, జ్యోతి పాల్గొన్నారు.

ఆస్పత్రికొచ్చే రోగుల పట్ల స్నేహభావంతో మెలగాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వైద్య సేవల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యాధికారులు, సిబ్బంది స్నేహభావంతో మెలగాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సమస్యలకు చికిత్స కొరకు ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల స్నేహభావంతో మెలగాలని, భోజన వసతి కల్పించాలని తెలిపారు. ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ వినియోగంలోకి తీసుకురావాలని, జిల్లా ఆసుపత్రిలో దయాలసిస్ కేంద్రం ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామని, డయాలసిస్ రోగులకు సేవలు త్వరలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు స్వామి, వైద్యులు సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మండుటెండలోనూ పాల్వాయి పాదయాత్ర

నవతెలంగాణ - బెజ్జూర్

మండుటెండలో సైతం పల్లెపల్లెకు పాల్వాయి గడపగడపకు బీజేపీ పాదయాత్ర నినాదంతో బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ నాయకులు పాల్వాయి హరీష్‌బాబు చేపట్టిన పాదయాత్ర మండలంలో రెండో రోజు సోమవారం కొనసాగింది. మండలంలోని నాగపెల్లి, మొగవెల్లి, గెర్రిగూడ, సోమిని గ్రామాల్లో కొనసాగుతోంది. మండుటెండను సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో సమస్యలు తెలుసుకుంటూ పర్యటిస్తున్నారు. ఆయా గ్రామాల్లో బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి రావాలని ప్రజలకు తెలియజేస్తున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మండలంలని అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పశువులకు వింత వ్యాధి



బెజ్జూర్ : మండలంలో పశువులకు వింత వ్యాధి సోకింది. మండల కేంద్రంలో పశువులకు బొబ్బలు బొబ్బలుగా ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో ప్రత్యేక పశు వైద్య క్యాంపు ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయమై బెజ్జూర్ ఇన్‌చార్జి పశు వైద్యాధికారి రాకేష్‌ను సంప్రదించగా రైతులు పశువులకు బొబ్బలు జబ్బు వస్తున్నట్టు తమకు సమాచారం అందిస్తే వైద్యం చేస్తామని తెలిపారు. పశువులకు ఎలర్జీ వల్ల ఇలాంటి వ్యాధులు వస్తాయని తెలిపారు.

ఎవరికి దక్కేనో ఇల్లు..!

- డబుల్ ఇండ్ల కోసం లబ్దిదారుల గుర్తింపు నేడు
- 656 ఇండ్లకు లాటరీ పద్ధతిలో ఎంపిక
- తొలి విడతలో 32వార్డులు పరిగణనలోకి
- ఏడేండ్ల నుంచి ఎడతెగని ఉత్కంఠకు తెర

ఏండ్లుగా అలంకారప్రాయంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపునకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. నిర్మాణం పూర్తయిన ఇండ్లను లబ్దిదారులకు కేటాయించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని మార్కెట్‌యార్డులో లాటరీ పద్ధతిన ఎంపిక చేసేందుకు సిద్ధమయ్యారు. తొలి విడతలో 32వార్డులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు 656ఇండ్ల కోసం లబ్దిదారులను గుర్తించనున్నారు. మిగితా 236ఇండ్లను వచ్చే వారంలో ఇదే పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అధికారులు ఈ లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని ఇది వరకే ప్రకటించినా అనివార్య కారణాలతో వాయిదా పడింది. దీంతో అర్హులైన లబ్దిదారులు నిరుత్సాహానికి గురయ్యారు. తాజాగా రెవెన్యూ అధికారులు ఇండ్ల కేటాయింపునకు రంగం సిద్ధం చేయడంతో పట్టణవాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ లక్కీ ఛాన్స్ ఎవరికి దక్కేనో అంటూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ పట్టణంలో డబుల్ బెడ్‌రూంలు నిర్మించిన ఏడేండ్లకు పైగా కావస్తోంది. కానీ పట్టణంలో లబ్దిదారులు అధికంగా ఉండటం.. నిర్మించిన ఇండ్లు చాలా తక్కువగా ఉండటంతో పంపిణీ చేయడంలో తాత్సారం జరిగింది. పూర్తయిన వాటిని పంపిణీ చేస్తే ఇండ్లు దక్కని వారి నుంచి వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో ఈ ప్రక్రియను అలాగే పెండింగ్‌లో పెట్టారు. కానీ పేదలకు ఇండ్లు కేటాయించాలని అన్ని వర్గాల నుంచి ఒత్తిడి రావడంతో అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టింది. 2016లోనే వార్డుల వారీగా దరఖాస్తులు స్వీకరించిన అధికారులు ఇండ్లను కేటాయించడంలో మాత్రం దృష్టిసారించలేకపోయారు. ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంతో ప్రజల్లోనూ అసంతృప్తిని రగిల్చింది. ప్రస్తుతం కేటాయింపునకు 982 ఇండ్లు మాత్రమే సిద్ధంగా ఉండగా ఇందుకు దరఖాస్తులు మాత్రం 9488 వచ్చాయి. ఈ దరఖాస్తులను భద్రపర్చిన అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంటింటికి తిరిగి విచారణ చేపట్టారు. ద్విచక్రవాహనం ఉన్న వారిని అనర్హులుగా ప్రకటించారు. విచారణ అనంతరం పట్టణంలో 3,179మందిని అర్హులుగా గుర్తించగా..6307మందిని అనర్హులుగా తేల్చారు. అర్హుల జాబితాను మున్సిపల్ కార్యాలయంలో ప్రదర్శించారు.

పంపిణీకి 982 ఇండ్లు సిద్ధం..!

ఆదిలాబాద్ పట్టణంలో లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు అపార్ట్‌మెంట్ తరహాలో ఇండ్లను నిర్మించారు. కేఆర్‌కే కాలనీ సమీపంలో 760ఇండ్లను నిర్మించగా.. జాతీయ రహదారికి ఆనుకొని 170 సర్వేనెంబర్ పరిధిలో 222ఇండ్లను నిర్మించారు. కేఆర్‌కే కాలనీలో నిర్మించిన వాటికి రంగులు వేయడం పూర్తికాగా.. జాతీయ రహదారి సమీపంలో వాటికి ఇంకా రంగులు వేయలేదు. తాజాగా తొలి విడతలో 656ఇండ్లను లాటరీ పద్ధతిలో లబ్దిదారులను ఎంపిక చేయనున్నారు. మిగితా ఇండ్లను వచ్చే వారంలో చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇన్నాండ్లు అలంకారప్రాయంగా ఉన్న ఈ ఇండ్లు త్వరలోనే అర్హులైన పేదలకు దక్కుతుండటంతో ఊరట లభించినట్లవుతోంది. సొంత గూడు లేక గుడిసెల్లో నివాసముండటం, ఏండ్ల తరబడి అద్దె ఇండ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్న పేదలకు పాలకులు, అధికారుల తాజా నిర్ణయం ఉపశమనం కలిగించనుంది. రోస్టర్, రిజర్వేషన్ ప్రకారం వీటిని కేటాయించేందుకు అధికారులు నిర్ణయించడం సానుకూలంగా మారుతోంది.

లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక : సతీష్, అర్బన్ తహసీల్దార్, ఆదిలాబాద్

ఆదిలాబాద్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను అర్హులైన లబ్దిదారులకు కేటాయించేందుకు లాటరీ ప్రక్రియ చేపడుతున్నాం. ప్రస్తుతం 32వార్డుల పరిధిలో ఈ ప్రక్రియ చేపడుతున్నాం. మిగితా వాటి కోసం వచ్చే వారం చేపడుతాం. రోస్టర్, రిజర్వేషన్ ఆధారంగానే కేటాయింపు ఉంటుంది. ఈ కార్యక్రమం ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుంది.

పోరాట పంథా..ఆదివాసులకు అండ..!

- విద్యార్థి ఉద్యమం నుంచి క్షేత్రస్థాయిలో సమరం
- ఉద్యమమే ఊపిరిగా సాగుతున్న పూసం సచిన్ ప్రస్థానం
- తాజాగా టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు

చిన్ననాటి నుంచే విద్యార్థి ఉద్యమాల పట్ల ఆసక్తి.. పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయనే భావన..ఆయన్ను విద్యార్థి ఉద్యమాల వైపు నడిపించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యార్థి, ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటం సాగించారు. పన్నెండేండ్ల అలుపెరగని పోరాటంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడి రాష్ట్ర స్థాయిలో కీలక నాయకుడిగా ఎదిగి విద్యార్థి, ఆదివాసీ ఉద్యమాల్లో తనకంటూ ఓ ప్రత్యేకతను సాధించాడు పూసం సచిన్. సమస్య ఉన్న చోటు నుంచే పోరాటాన్ని ప్రారంభించాలనే గట్టి సంకల్పంతో అనేక ఉద్యమాల్లో భాగస్వాములై వాటి పరిష్కారానికి తన వంతు కృషిచేశారు. తాజాగా భద్రాచలంలో జరిగిన ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై అందరి మన్ననలు పొందుతున్నారు.



ఆందోళనలో భాగంగా పోలీసులు అరెస్ట్ చేస్తున్న దృశ్యం(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా బేల మండలం చాంద్‌పల్లి గ్రామానికి చెందిన చాయబాయి- నారాయణ దంపతుల మూడో కుమారుడు పూసం సచిన్. తల్లిదండ్రులు సుమారు 20ఏండ్ల క్రితమే కూలీ పనుల కోసం జిల్లా కేంద్రానికి వచ్చి స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లో స్థిరపడ్డారు. పదో తరగతి వరకు సైద్‌పూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసించిన సచిన్..ఇంటర్‌లో ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చేరారు. ఈ సమయంలోనే తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2011లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ)లో చేరి కళాశాల కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. తాను చదువుకుంటున్న కళాశాలలో పరీక్ష ఫీజుతో పాటు స్పెషల్ ఫీజు వసూలు చేయడాన్ని నిరసించి పోరాటం చేపట్టారు. దీంతో కళాశాల యాజమాన్య ఈ ఫీజును రద్దు చేసింది. వీటితో పాటు కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని, మౌళిక వసతులు కల్పించాలని పోరాటాన్ని చేపట్టారు. దీంతో ప్రభుత్వం అప్పట్లో రూ.68లక్షలతో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టింది. తదనంతరం ఈ సంఘంలో పట్టణ కార్యదర్శిగా, డివిజన్ కార్యదర్శిగా వసతి గృహాల్లో మౌళిక వసతుల సమస్య, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎప్పటికప్పుడు గళమెత్తేవారు. తదనంతరం 2015 సంఘం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గిరిజన వసతిగృహాలకు సొంత భవనాలు కేటాయించాలని, మౌళిక వసతులు కల్పించాలని తోటి సభ్యులతో కలిసి తొమ్మిది రోజుల పాటు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. స్పందించిన ప్రభుత్వం కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించింది. ఎస్ఎఫ్ఐలో ఉన్న సమయంలోనే జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని చేపట్టిన ఉద్యమానికి విద్యార్థి జేఏసీ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో చేపట్టిన ఉద్యమాలతో పోలీసు కేసులను కూడా ఎదుర్కొంటున్నారు.

ఆదివాసీ విద్యార్థి సంఘానికి అంకురార్పణ

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా రెండేండ్ల పాటు బాధ్యతలు నిర్వర్తించిన సచిన్ తదనంతరం ఉన్నత చదువుల కోసం హైదరాబాదు వెళ్లారు. అక్కడ పీజీ విద్యను పూర్తిచేసి మళ్లీ ఆదిలాబాద్‌కు వచ్చి ప్రజా ఉద్యమ అవసరాల రీత్యా తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్)కు అంకురార్పణ చేశారు. అప్పటికే విద్యార్థి ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన అనుభవం ఉండటంతో ఆదివాసీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి పోరాటం నిర్వహించారు. ఆయా హాస్టళ్లను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను నమోదు చేసుకొని ఐటీడీఏ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేశారు. జాప్యం జరిగితే ఉద్యమాలు చేపట్టడం వంటి చర్యలతో ఆదివాసీ విద్యార్థి ఉద్యమానికి జిల్లాలో ఊపు తీసుకొచ్చారు. సంఘం ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు ఏకంగా రెండు రాష్ట్ర మహాసభలను నిర్వహించి అందరి మన్ననలు పొందారు.

ఆదివాసీల హక్కుల కోసం..!

విద్యార్థి ఉద్యమాల్లో పాలుపంచుకుంటూనే ఆదివాసీ గిరిజన సంఘంలోనూ 2019లో కీలక బాధ్యతలు చేపట్టారు. ఈ సంఘంలో జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ ఆదివాసీ గిరిజన గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. పోడు భూములకు పట్టాలు అందించాలనే డిమాండ్‌తో పాటు బేల మండలం పాటగూడ, ఉట్నూర్ మండలం అడగూడకు రోడ్డు, బ్రిడ్జి నిర్మించాలని నిరహార దీక్షలు చేపట్టడం, ఐటీడీఏ ముట్టడి వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో స్పందించిన అధికారులు బ్రిడ్జి, రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. గాదిగూడ మండలం కుండిషేకుగూడ వాసులు తాగునీటికి అల్లాడుతూంటే వారితో పాటు జిల్లా కేంద్రం వరకు సుమారు సుమారు 75కి.మీలు పాదయాత్ర చేపట్టారు. జిల్లా కేంద్రంలో కొన్ని రోజుల పాటు చేపట్టిన ఈ దీక్షలకు స్పందించిన అధికారులు కుండిషేకుగూడలో తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. వీటితో పాటు ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీ విజ్ఞాన సమాజాన్ని నిర్మిద్దామనే నినాదంతో అనేక గ్రామాల్లో మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఆదివాసీల చట్టాలు, హక్కులపై వివరిస్తూ గిరిజనుల్లో చైతన్యం తీసుకొచ్చారు. పీటీజీలుగా భావించే కొలాం, తోటి తదితర జాతుల భాషా, సంస్కృతి పరిరక్షణ కోసం అనేక సదస్సులు ఏర్పాటుచేశారు. ఈయన చేపడుతున్న ప్రజా ఉద్యమాలను గుర్తించిన రాష్ట్ర సంఘం బాధ్యులు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. ఈ సంఘానికి భద్రాలచం మాజీ ఎంపీ మిడియం బాబురావు అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు.

మరింత బాధ్యతగా పనిచేస్తా : పూసం సచిన్, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



విద్యార్థులు, ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తున్నాం. ఈ ప్రస్తానంలో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇంకా చేపట్టాల్సిన కార్యక్రమాలు అనేకమున్నాయి. నేను చేపడుతున్న పోరాటానికి గుర్తింపుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నాను. మరింత బాధ్యతగా పనిచేస్తూ ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కానికి కృషి చేస్తాను.

'అక్రమ అరెస్టులతో నిర్బంధించలేరు'

నవతెలంగాణ-కాసిపేట

అక్రమ అరెస్టులతో ప్రజాగొంతును నిర్బంధించలేరని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ అన్నారు. దేవాపూర్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్నందున ముందస్తుగా పోలీస్‌లు ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన సంకె రవి, కృష్ణ మాట్లాడుతూ అరెస్ట్ ప్రభుత్వ పిరికి చర్యగా అభివర్ణించారు. ఇలాంటి నిర్బంధాలతో ప్రజాపోరాటాలను ఆపలేరని తెలిపారు. దేవాపూర్ ఓరియంట్ కంపెనీలో మండల యువతకు ఉద్యోగాల కల్పనకు కేటీఆర్ ఇప్పటికైనా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

పారిశ్రామిక అభివృద్ధి దిశగా ప్రభుత్వ కృషి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు



నవతెలంగాణ-కాసిపేట

పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తూ తద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటి, పురపాలక, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సోమవారం మండలంలోని దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీలో 2వేల కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 4వ ప్లాంట్ కు రాష్ట్ర రక్షణ, జైళ్లు, అగ్నిమాపక శాఖ మంత్రి ఎండి. మహమూద్ అలీ, రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, ఆత్రం సక్కు, ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఎండి. దీపక్ క్షేత్రపాల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలు దేశాన్ని రాష్ట్రం వైపు చూసే విధంగా ఆకర్షిస్తున్నాయన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో టిఎస్ ఐ పాస్, టి-ప్రైడ్ కార్యక్రమాల ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో రానున్న రోజుల్లో దేవాపూర్‌ను సీఎస్ఆర్ నిధులతో మరింత అభివృద్ధి చేస్తామని, ప్లాంట్ పనులు పూర్తి అయిన తర్వాత మళ్లీ వస్తానని, దేవాపూర్ అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అదిలాబాద్ ఉమ్మడి జిల్లా అడవుల జిల్లాగా పేరు పొందిందని, స్వచ్ఛమైన సహజవాయువు అందుతుందని, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించి ప్రజలందరికీ ఆరోగ్యకరమైన వాయువు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ అధికారులు, సీపీ రెమా రాజేశ్వరి, ఓసీపీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, సర్పంచ్ తిరుమల, ఎంపీపీ రోడ్డ లక్ష్మీ, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమతి లేనిదే భూముల్లో ఎలా సర్వే చేస్తారు?

- ఆర్డీవో వాహనాన్ని అడ్డగించిన ఎన్‌హెచ్-63 బాధితులు



నవతెలంగాణ - హాజీపూర్

'మా అనుమతి లేనిదే మా భూముల్లో సర్వే చేసే అధికారం మీకెక్కడిది', అంటూ ఎన్‌హెచ్ 63 బాధితులు ఆర్డీవో వేణును ప్రశ్నించారు. వారం రోజులుగా టెంట్లు వేసుకొని ఎన్‌హెచ్ 63 సర్వేను అడ్డుకుంటున్న బాధితులు సోమవారం ఉదయం సర్వేకు వచ్చిన ఏజెన్సీ బృందాన్ని అడ్డుకున్నారు. దీంతో వారు తహసీల్దార్ రాజలింగంకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న తహసీల్దార్ బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో ఆర్డీవో వేణుకు సమాచారం అందజేశారు. బాధితులు నిరసన తెలుపుతున్న ప్రదేశానికి వచ్చిన ఆర్డీవోను నిలదీశారు. నోటిఫికేషన్‌లో అభ్యంతరాలుంటే ఆర్డీవోకు తెలియజేయమని చెప్పడంతో అభ్యంతరాలతో కూడిన పత్రాలు అందజేశామని, కానీ మా బాధలు పట్టించుకోకుండా మళ్లీ సర్వే ఎలా జరిపిస్తారని నిలదీశారు. ఎవరికి చెప్పుకోవాలి మా బాధలు అని బోరున విలపించారు. అక్కడి నుండి ఆర్డీవో జారుకునే ప్రయత్నం చేయగా ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. మా అనుమతులు లేకుండా మా భూముల్లో సర్వే చేసే అధికారం మీకెక్కడిదని ప్రశ్నించారు. దీంతో చేసేదేమీలేక ఆర్డీవో ఎన్‌హెచ్63 అధికారులతో మాట్లాడి రేపు పూర్తి వివరాలు తెలియజేసిన తరువాతే సర్వే చేస్తామని చెప్పడంతో బాధితులు శాంతించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ 63 బాధితుల సంఘం మండల అధ్యక్షుడు కందుల రమేష్, వోడ్నాల శ్యామ్, భూమయ్య, మల్క రామయ్య, బాపు, బొడకుంటి మల్లేష్, సురేష్, బాపు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయడానికే సమ్మర్ సమ్మిట్



ఆదిలాబాద్ అర్బన్ : గిరిజన చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికే సమ్మర్ సమ్మిట్ (వేసవి శిబిరాలు) ఏర్పాటు చేయడం జరిగిందని, గిరిజన చిన్నారులలో ఊహించని సృజనాత్మకత దాగి ఉందని గిరిజన సంక్షేమ శాఖ ఏసిఎంఓ జగన్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక గిరిజన బాలికల పాఠశాలలో నిర్వహించిన 'ఐతారం ముచ్చట్లు' కవి సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు కథలు, కవితలు, పాటలు విని బాల సాహిత్యానికి చేరువయ్యేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణ మాట్లాడుతూ 'ఐతారం ముచ్చట్లు' కవి సమ్మేళనం ద్వారా బాలబాలికల్లో సాహిత్య అభిరుచిని కలిగిస్తున్నామన్నారు. సదరు కార్యక్రమం ఆ పాఠశాలలో నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.లక్ష్మినారాయణ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు ద్వారా విద్యార్థులు వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటున్నారని అన్నారు. తెలుగు, ఆంగ్లం, డ్రాయింగ్, ఎంబ్రాయిడరీలను విద్యార్థులు ఉత్సాహంగా నేర్చుకుంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కవులు కమ్మల నర్సిములు, బి.బాబన్న, యు. గంగన్న, రాజు వంశీ, నిమ్మల ప్రశాంత్, రవికాంత్ జాదవ్, మల్లికార్జున్, రిజ్వాన్, శైలజ, జి.సరిత, గాయత్రి, అశోక్, మహేష్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
మంగళవారం 09 మే 2023

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రంలో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్ రెడ్డి, బీఆర్ఎస్ ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, ఎంపీపీ అడ్వల పద్మ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న గిట్టుబాటు ధరకు రైతులు తమ ధాన్యన్ని అమ్ముకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శాతం గంగారాం, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ వెంకట్‌రాజు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ గణేష్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

నవతెలంగాణ-ఉట్నూర్



ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన బాధితులకు బరోసాగా తెలంగాణ ప్రభుత్వం ఉంటుందని, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బాదవత్ పూర్ణ చందర్ అన్నారు. సోమవారం పెర్కగూడ, హనుమాన్ నగర్, ఏంక గ్రామాల్లో పర్యటించి, బాధిత కుటుంబాలతో, ప్రజలతో మాట్లాడారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా రావట్లేదని, నీటి కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మిషన్ భగీరథ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

శిక్షణలు పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన మత్స్య సహకార సొసైటి సభ్యులు శిక్షణలు పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ కే.వరుణ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో మండలంలోని కోపర్‌ఘడ్, మత్తడిగూడ, జైనూర్ మండలానికి చెందిన మత్స్య సహకార సొసైటీ సభ్యులకు చేపలు పట్టేందుకు రూ.2 లక్షల 43 వేల విలువైన ఉచిత శిక్షణ సామాగ్రిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ చేపలు పట్టేందుకు గిరిజన మత్స్యకారులు శిక్షణలు పొంది ఆదాయం పెంచుకోవాలని అన్నారు. సొసైటీలలోని ప్రతి సభ్యుడు శిక్షణ పొంది ఉపాధి అవకాశాలను కల్పించుకోవాలని అన్నారు. జిల్లాలో ప్రతి సొసైటీ మోడల్ సొసైటీలుగా తయారుకావాలని ఆకాంక్షించారు. అన్ని సొసైటీలకు శిక్షణలు అందించాలని పేసా కోఆర్డినేటర్ అర్క వసంత్ రావ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏఓ రాంబాబు, సొసైటి సభ్యులు ఉన్నారు.

భారత రాజ్యాంగ పుస్తకాలను ఉచితంగా అందజేయాలి

నవతెలంగాణ-తలమడుగు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రతి పౌరునికి ఉచితంగా అందించాలని కోరుతూ సోమవారం ధర్మ సమాజ్ పార్టీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరునికి రాజ్యాంగం మీద అవగాహన ఉన్నప్పుడే రాజ్యాంగ ఫలాలు ప్రతి పౌరుడు హక్కుగా భావించి, ప్రభుత్వాలు అందిస్తున్న ఫలాలు పొందగలుగుతారని అన్నారు. రాజ్యాంగ హక్కులను సాధించి, దేశ భవిష్యత్తుకు యువతకు తోడ్పాటు అందించగలుగుతారని అన్నారు. అలాంటి రాజ్యాంగ విలువలు గల రాజ్యాంగ పుస్తకాన్ని ప్రతి పౌరునికి అందించకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మా ధర్మసమాజ్ పార్టీ దండయాత్ర కొనసాగిస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ నాయకులు నవీన్ మహారాజ్, గంగన్న మహారాజ్, ప్రేమేందర్ మహారాజ్, సాయికుమార్, సురేష్, విను కుమార్, సంజీవ్, సాయిరాం, శ్రీనివాస్, తరుణ్, చందు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'బీఎస్పీని మాదిగలు విశ్వసించొద్దు'

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి పార్టీని మాదిగలు విశ్వసించరాదని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్ అన్నారు. సోమవారం స్థానిక కైలాస్‌నగర్‌లోని ఓ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐక్యత కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ స్నేహ హస్తం అందిస్తే, బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి మాత్రం అందుకు విరుద్ధంగా నడుచుకున్నారని ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బీఎస్పీ భరోసా సభలో పాల్గొన్న మాయావతి ఎస్సీ వర్గీకరణపై ప్రకటన చేయకుండా మాదిగల హృదయాలను గాయపరిచిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపితే బీఎస్పీతో కలిసి పని చేస్తామని తెలుపుతూ మాయావతికి లేఖ రాసిన మంద కృష్ణ మాదిగకు ఏమాత్రం స్పందన తెలియజేయకపోవడం ఆమె దురహంకారానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. మాయావతికి ఉత్తరాది చమార్ జాతుల ప్రయోజనాలే తప్ప దక్షిణాది మాదిగల బ్రతుకుల గురించి పట్టింపే లేదని విచారం వ్యక్తం చేశారు. ఉత్తరాదిలో చమర్ జాతులు ఎస్సీ రిజర్వేషన్లను ఏకపక్షంగా దోపిడీ చేస్తున్నారని, ఆ దోపిడీ కొనసాగాలనే స్వార్థంతోనే ఎస్సీ వర్గీకరణను మాయావతి వ్యతిరేకిస్తోందని విమర్శించారు. దక్షిణాది మాదిగల ఆకాంక్షలకు విలువనివ్వని స్వార్థపూరితమైన మాయావతి నాయకత్వం తమకు అవసరం లేదని తెలిపారు. ఈ మేరకు మాదిగలంతా బీఎస్పీకి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్లు పాలేపు గణేష్, బరుకుంట సుభాష్, జిల్లా నాయకులు నవీన్, ఉప్పులేటి శ్రీను, చిట్టి రవి, అడ్డిగా స్వామి, సుంకే అనిల్, ఎంఎస్ఎఫ్ జిల్లా కోకన్వీనర్ పసుల శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలకు మండల స్థాయిలో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ ఎంపీడీఓగా నూతనంగా లక్ష్మీకాంత్ ఉద్యోగ బాధ్యతలు ఈ సందర్భంగా ఆయనను సోమవారం ఎంపీపీ గంద్రత్ రమేష్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్, ఐకేపీ సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందించి, స్వాగతం పలికారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మండల స్థాయి ఈనెల 15 నుండి 17 వరకు మూడు రోజుల పాటు సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఎంపిక మండల స్థాయి కమిటీ ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు 18 నుంచి 36 సంవత్సరాలు కలిగి ఉన్న వారు అర్హులని అన్నారు. ఈ ఆటల పోటీలలో పాల్గొనేవారు తమ పేర్లు నమోదుకై ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని అన్నారు. ఇతర వివరాలకు 8919601028 నెంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

నేడు విపశ్వన ధ్యానంపై అవగాహన

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విపశ్వన ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు కార్యక్రమ నిర్వాహకులు చిలువేరి సాయి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10:00 నుండి 12 గంటల వరకు ఈ ప్రత్యేక సదస్సును విపశ్వన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం బాధనకుర్తి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

సీఎం కప్ టోర్నీ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ అధ్యక్షతన సీఎం కప్ టోర్నమెంట్ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎంపీపీ సూచించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో స్థానిక డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కవితరెడ్డి, ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరుద్దీన్, ఏపీఓ వాణిశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల



నవతెలంగాణ-భైంసా

మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. సోమవారం భైంసా పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన లోక్ సభ ప్రవాస్ యోజన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు 50 సంవత్సరాల పాలనలో కేవలం మత్స్యశాఖకు రూ.3600 కోట్లు మంజూరు చేస్తే, మోడీ ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాల్లో రూ.20వేల కోట్ల నిధులు మత్స్య శాఖకు కేటాయించడం జరిగిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ రంగానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజల త్వరలోనే చరమగీతం పాడతారని అన్నారు. మాటలు తప్ప సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. బీడీ కార్మికుల సమస్యలపై ప్రధాని ప్రధానమంత్రి మోడీ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. భైంసాకు వచ్చిన కేంద్రమంత్రికి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బోకర్ పాట చెక్‌పోస్ట్ నుండి ఎస్‌వి ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రికి బీజేపీ నియోజకవర్గ నాయకులు, పవర్ రామారావు పటేల్ పలు సమస్యలను విన్నవించారు. జనాభా పరంగా భైంసా పట్టణం అతిపెద్దదని అనేక మంది రైతులు ఉన్నారని తెలిపారు. పశువుల కోసం వైద్యశాలకు నిధులు కేటాయించాలని ఆయన వినతిపత్రాన్ని అందించారు. వైద్యశాలలో డిజిటల్ ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఏర్పాటుకు రూ.కోటి నిధులు కేటాయించాల్సిందిగా ఆయన కోరారు. అనంతరం కాలనీలో దళిత బీజేపీ కార్యకర్త ఇంట్లో ఆయన భోజనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, ఇన్‌చార్జ్ అల్జాపూర్ శ్రీనివాస్, నాయకులు అయ్యన్నగారి భూమయ్య, మోహన్ రావు పటేల్, నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ బి గంగాధర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వర్షాకాలం తర్వాతే రైల్వే అండర్ బ్రిడ్జి పనులు

- రైల్వే బ్రిడ్జిల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రానున్నది వర్షాకాలం ఆ సమయంలో రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు చేపట్టడం కష్టతరంగా మారుతుందని, ప్రజలకు కొత్త ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం రైల్వే అండర్ బ్రిడ్జీ స్థలాన్ని, ఆయా శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం పూర్తయిన తర్వాతే రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులు ప్రారంభిస్తే ఇక్కట్లు ఉండవని అధికారులు తనకు సూచించారు. సుందరయ్యనగర్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం నిరాటంకంగా కొనసాగనుండగా అండర్ బ్రిడ్జ్ విషయానికి వచ్చేసరికి మాత్రం వర్షాకాలంలో ఎక్కువ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని, అందుకు వానలు తగ్గుముఖం పట్టిన తర్వాతనే పనులు ప్రారంభిస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని అధికారులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్, ఆర్ అండ్ బీ, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించారు. వారివారి శాఖల పరిధిలో జరిగే పనుల వివరాలను ఎమ్మెల్యే ఆరా తీశారు. అనంతరం నిర్మాణ పనులను పూర్తి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల సమన్వయంతో రైల్వే వంతెనల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. వర్షాకాలంలో అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి సాంకేతికపరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని పేర్కొన్నారు. దాని కారణంగా ప్రజలు మరిన్ని ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని అందువల్ల ప్రజలకు ఇక్కట్లు తలెత్తకుండా వర్షాకాలం ముగిసిన వెంటనే పనులు ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా డిప్యూటీ సీఈ శివరాం మాట్లాడుతూ అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల వివరాలను వెల్లడించారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులతో పనుల గురించి విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగుప్రేమేందర్, వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, ఆర్డీఓ రాథోడ్ రమేష్, మున్సిపల్ కమిషనర్ శైలజ, నాయకులు అశోక్ స్వామి, పందిరి భూమన్న, రైల్వే, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పోలీస్ సిబ్బంది పనితనం మరింత మెరుగుపడాలని సిబ్బంది విధులను ఒక క్రమబద్ధీకరణతో నియమించాలని ఎస్పీ డి. ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదిలాబాద్ గ్రామీణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి తనిఖీ చేశారు. మొదటగా ఆదిలాబాద్ గ్రామీణ సీఐ బి.రఘుపతి, ఎస్సై జి.నాగనాథ్ పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా ఎస్పీకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సాయుధ బలగాలచే ఏర్పాటు చేయబడిన గౌరవ వందనాన్ని స్వీకరించి, జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒక మొక్కను నాటారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది విధులను ఒక క్రమబద్ధీకరణతో నిర్ణయించి, సరైన పద్ధతిలో విధులను నిర్వర్తించేలా చూడాలని పోలీస్ స్టేషన్ అధికారికి సూచించారు. సిబ్బంది నిర్వర్తించే విధులను ప్రత్యేకంగా ఒక్కొక్కరితో మాట్లాడి తెలుసుకొని తగు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ కార్యాలయాన్ని, సిబ్బంది స్టేషన్ నిర్వహించే పద్ధతిని, పరిసరాలను, లాకప్, స్టేషన్ రూమ్, రైటర్ గది వాటిని పరిశీలించి సూచనలు చేశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న వివిధ కేసులకు సంబంధించిన వాహనాలను సిబ్బంది వేచి ఉండే ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పూర్తి అయిన కేసులలో త్వరితగతిన తదుపరి ఉత్తర్వులను తీసుకొని వాహనాలను తిరిగి ఇచ్చే విధంగా చూడాలని తెలియజేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేసుల ప్రస్తుత స్థితిగతులను కోర్టులను పెండింగ్‌లో ఉన్న కేసు వివరాలను తెలుసుకొని, తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అదేవిధంగా రిసెప్షన్ సెంటర్ నందు వచ్చే ఫిర్యాదుల పట్ల వ్యవహరించాల్సిన తీరును ప్రజలకు పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించే విధంగా తీసుకోవాల్సిన పద్ధతులను రిసెప్షన్ అధికారిని అడిగి తెలుసుకొని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా దర్యాప్తు పూర్తిచేసి, న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్టేషన్ రికార్డులు ఫైళ్లను ఒక క్రమబద్ధీకరణలో ఉంచుకొని 5ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేయాలని సిబ్బంది అందరికీ అన్ని వర్టికల్స్‌పై అవగాహనను కల్పించే విధంగా సిబ్బందిని తయారు చేయాలని సూచించారు. సంఘటన జరిగిన అనంతరం వేగంగా స్పందించే రియాక్టివ్ పోలీసింగ్ కంటే సంఘటన జరగకముందే ముందస్తుగా పసిగట్టి నివారించే ప్రో యాక్టివ్ పోలీసింగ్ ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్క గ్రామాన్ని సందర్శిస్తూ గ్రామంలో ఉన్న పెద్దలతో సమన్వయంగా ఉంటూ ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలని తెలియజేశారు. ప్రస్తుతం సైబర్ క్రైమ్ జరుగుతున్న నేపథ్యంలో గ్రామాలలో సందర్శించే సమయంలో ఉన్న యువతకు పెద్దలకు సైబర్ క్రైమ్ నేరస్తులు ఉపయోగించే నవీన పద్ధతులను వివరించి మోసపోకుండా తగు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామంలోని ప్రజలకు డయల్ 100పై అవగాహనను కల్పించి, ఎటువంటి అత్యవసర పరిస్థితిలోనైనా ప్రజలు డయల్ 100ను వినియోగించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల యువత, ప్రజలు పట్టణ ప్రాంతాలకు వచ్చే మార్గాలలో ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్‌ను చేయకుండా చూడాలని వివరించారు. సిబ్బంది మరింత కష్టపడి పనితీరును మెరుగు పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ బి రఘుపతి ఎస్సై, జి నాగనాథ్, సర్కిల్ ఎస్సైలు విష్ణు వర్ధన్, జి.అప్పారావు సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-నార్నూర్

దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ అధ్వర్యంలో ఉమ్రి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు పూసం సురేష్, సలాం మధు గ్రామ నాయకులతో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల పోటీలో పాల్గొనడం వలన స్నేహ భావం పెరుగుతుందని అన్నారు. క్రీడలు దేహదారుడ్యానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో అడి గెలుపోటములను సమానంగా స్వీకరించాలనీ సూచించారు. విజేతకు మొదటి బహుమతి రూ.21 వేలు, రెండో బహుమతి రూ.11వేలు నగదు బహుమతి అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంతోష్ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం కప్ అటల పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-తాంసి

ఈ నెల 15వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహించనున్న సీఎం కప్ ఆటల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తాంసి మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ భూమయ్య తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 13వతేది వరకు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ ఆటలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దరఖాస్తులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని అన్నారు.

మాతాశిశు మరణాలపై కళాజాత

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని రిమ్మ గ్రామంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే రక్తహీనత, మాత శిశు మరణాలు, బాల్యవివాహాలపై గోండి భాషలో పాటలు పాడుతూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణీలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, గర్భంతో ఉన్న మహిళలు నెల నెల ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేసుకోవాలని అన్నారు. ప్రసవ సమయంలో ప్రభుత్వ ఆస్పత్రికే వెళ్లాలని పాటల రూపంలో సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ కుమార్, టీం లీడర్ కొమ్రు నగేష్, గట్టు వెంకట్ రావ్, శ్రావణ్, మురళి, గోవింద్ రావ్, గోదావరి, నర్సమ్మ, రేల రేల సింగర్ చాకటి రవి, శంకర్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

కష్టించి పంట చేతికి వచ్చి విక్రయించే సమయంలో రైతు ధాన్యాన్ని దళారులను అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, లాభాలు గడించాలని ఎమ్మెల్యే రేఖ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని బీర్నంది గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులు నష్టపోవద్దనే ఏకైక లక్ష్యంతో మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను రైతులు పొంది లాభాలు గడించాలని అన్నారు. ఆమె వెంట స్థానిక సర్పంచ్ సాగి సువర్ణ లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మెన్ ఇప్ప సత్యనారాయణరెడ్డి, ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్‌తో పాటు నాయకులు కొక్కుల ప్రదీప్, పుప్పాల శంకర్, మరుగుజ్జు సంఘం జిల్లా నాయకులు సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకొని ఇటీవల అకాల మరణం పొందిన జైనథ్ మండలంలోని కరంజి గ్రామానికి చెందిన కల్వల్‌వార్ గణపతి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ చేయూతనందించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి అందించే రూ.2లక్షల బీమా చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ సభ జరుగుతున్న స్థలంలో బాధిత కుటుంబ సభ్యులకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత చేతుల మీదుగా అందించారు. వారితో పాటు గంద్రత్ ఆశన్న, కన్య ప్రభాకర్ రెడ్డి, గంగన్న ఉన్నారు.

వయోవృద్ధుల ఫిర్యాదులకు వెబ్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ ఆర్డీఓ కదం సురేష్ సూచించారు. తెలంగాణ వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ సూచనల మేరకు సోమవారం వయోవృద్ధుల పోషణ ఫిర్యాదుల వెబ్‌పోర్టల్ ఆయన స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సురేష్ మాట్లాడుతూ నిరాదారణకు గురైనా తల్లితండ్రులు, వయోవృద్ధులు పోషణ, సంరక్షణ విషయంలో సరిగ్గా వ్యవహరించని పిల్లలపై అన్ లైన్‌లో సీనియర్ సిటిజన్ మెయింటెనేన్స్ కోసం ఆన్‌లైన్‌లో ఉన్న వెబ్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ విధానం ద్వారా సత్వర న్యాయం జరిగేందుకు అవకాశం ఉందన్నారు.

మండల కేంద్రానికి డబుల్ రోడ్డు మంజూరు చేయాలి



నవతెలంగాణ-సిరికొండ

మండల రెండు వరుసల రహదారి మంజూరు చేయాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో ఐటీశాఖ మంత్రి కేటీఆర్ సూచన మేరకు రహదారులు, భవనముల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని ప్రముఖ వ్యాపార వేత్త నరేందర్ నాయక్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఇచ్చోడ నుండి సిరికొండ మండల కేంద్రానికి వెళ్లే రహదారి ఇరుకుగా ఉందని అన్నారు. తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సంబంధిత మంత్రికి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తమ సమస్యను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

విద్యుత్ తీగ తగిలి గేదె మృత్యువాత

నవతెలంగాణ-సారంగాపూర్



విద్యుత్ తీగ తగిలి గేదె మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని ఆలూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నోళ్ల రమేష్‌కు చెందిన రైతు గేదె సోమవారం తన పంట చేనులోనే మేత మేస్తు వెళ్లి విద్యుత్ స్తంభం వద్ద విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే గేదె మృతి చెందింది. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి బాధిత రైతును ఆదుకోవాలని కోరారు.

జీఎం సివిల్‌గా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ

నవతెలంగాణ - రెబ్బెన



బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం కార్యాలయంలో జీఎం సివిల్‌గా కె సూర్యనారాయణ నూతనంగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. గోలేటి జీఎం కార్యాలయంలో జీఎం దేవేందర్ ఇతర అధికారులు కలిసి శాలువాలతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సూర్యనారాయణ మంచి వర్క్ మైండెడ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం గుప్తా, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీజీఎం(ఐసీ) బెహెర, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించడమే లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రతి ఒక్కరికి పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. మండలంలోని తుంపల్లి ప్రాంతాల్లో ఉపాధి పనులను పరిశీలించి కూలీల బాధలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులు లేకుండా చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ప్రతి వ్యక్తికి పని కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. కూలీలకు అవసరమైన సదుపాయాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని డాబా గ్రామానికి చెందిన వడాయి మారుతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్‌పీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య వివరాలు వెల్లడించారు. వడాయి మారుతిని సీఐ, ఎస్‌ఐ ఆధ్వర్యంలో 24 గంటల్లో పట్టుకున్నారు. మారుతికి 2015లో అమృతతో వివాహం జరిగింది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్ని రోజుల నుండి మారుతి తాగుడుకు బానిసై ప్రతి రోజు మద్యం తాగి పని చేయకుండా గ్రామంలో తిరుగుతుండేవాడు. అమృత తల్లిదండ్రులకు తెలపగా వారు డాబా గ్రామానికి వెళ్లి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడారు. అయినా ఎలాంటి మార్పు రాలేదు. ఈ నెల 6న రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చి గొడ్డలితో అమృతపై దాడిచేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అమృత వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతోనే గొడ్డలితో భార్య మెడపై రెండు సార్లు, భుజంపై నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇద్దరి మధ్య గొడవ జరుగుతున్న సమయంలో ఆపడానికి వచ్చిన అదే గ్రామానికి చెందిన మొర్లె పొచ్చు తలపై, భుజాలపై గొడ్డలితో దాడి చేయడంతో అతనికి కూడా గాయాలయ్యాయి. విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సాగర్ ఉన్నారు.

మానవతావిలువల పెంపుకే బాలవికాస్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

చిన్న పిల్లలు, విద్యార్థులలో మానవతావిలువలను పెంపొందించేందుకు బాలవికాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి ఆర్గనైజేషన్ జిల్లా యూత్ ఇన్‌ఛార్జి కె సతీష్, జిల్లా బాలవికాస్ ఇన్‌ఛార్జి భార్గవి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరు నుండి 15 ఏళ్ల లోపు విద్యార్థులకు సనాతన ధర్మం బోధించడంతో పాటు వారిలో ఆధ్యాత్మిక విలువలతో కూడిన పద్యాలు, శ్లోకాలు నేర్పించనున్నట్లు తెలిపారు. చిన్ననాటి నుండే మానవతావిలువలను వారిలో పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, దీనికి అన్ని మతాల పిల్లలు హాజరు కావచ్చని సూచించారు.

15 నుండి మండల స్థాయి పోటీలు

నవతెలంగాణ - వాంకిడి

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుండి 17వ తేదీ వరకు మండలస్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలస్థాయి పోటీలో పాల్గొనడానికి ప్రతి గ్రామం నుండి ఒక టీం పేరు నమోదు చేసుకోవడానికి కార్యాలయంలో సంప్రదించినట్టయితే అన్ని వివరాలను క్రీడాకారులకు అందిస్తామన్నారు. కబడ్డీ పురుషులు, మహిళలు, ఖోఖో పురుషులు, మహిళలు, వాలీబాల్ పురుషులు, మహిళలు, ఫుట్‌బాల్ పురుషులు, మహిళలు, అథ్లెటిక్స్ 100 మీటర్లు, 400 మీటర్లు పురుషులు, మహిళలకు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 11 సాయంత్రం 5 గంటల లోపు ఎంపీడీఓ కార్యాలయంలో టీం పేర్లను అందజేయాలని కోరారు.

గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీలో అడ్మిషన్ తీసుకున్న రెగ్యులర్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం రెగ్యులర్ సెమిస్టర్-6 విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ నెల పదో తేదీలోగా చెలించాలని కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా సెమిస్టర్ 2 మరియు 4 విద్యార్థులు ఈ నెల 12వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్, డెబిట్, క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించాలని సూచించారు. సైన్స్ విద్యార్థులు అదనంగా ప్రాక్టికల్ ఫీజు చెల్లించాలని ఆయన సూచించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ - రెబ్బెన

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కిష్టాపూర్ సర్పంచ్ దాగం జమున దామోధర్ అన్నారు. సోమవారం ఆమె రిబ్బన్ కట్ చేసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏండ్లు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందజేస్తారన్నారు. కంటికి సంబంధించి ఏ చిన్న సమస్యలున్నా నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర జయ రాజయ్య, వార్డుసభ్యులు తోడె మల్లారెడ్డి, సునార్కర్ జమున తిరుపతి, కోఆప్షన్ సభ్యుడు చాపిడి బక్కయ్య, పంచాయతీ సెక్రటరీ కల, గ్రామపెద్దలు, బీఆర్‌ఎస్ నాయకులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ మహిళలు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మాయావతి మాట్లాడకపోవడం అవివేకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బీఎస్పీ అధినేత్రి మాయావతి తెలంగాణ పర్యటనలో భాగంగా ఆదివారం జరిగిన సమావేశంలో ఎస్సీ వర్గీకరణపై మాట్లాడకపోవడం ఆమె అవివేకాన్ని తెలియజేస్తుందని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల రిజర్వేషన్లకు అనుకూలంగా వ్యవహరించిన మాయావతి ఎస్సీల వర్గీకరణకు మద్దతు ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. మాయావతి నిర్ణయంతో మాదిగ ఉప కులాలు బీఎస్పీకి దూరం కానున్నాయని చెప్పారు. మాయావతి నిర్ణయాన్ని మాదిగలు వ్యతిరేకిస్తున్నారన్నారు. వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకొని వర్గీకరణకు మద్దతు తెలపాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీఎస్పీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ రేగుంట మహేష్, నియోజకవర్గ కోఆర్డినేటర్ రేగుంట సాగర్, నాయకులు లక్ష్మణ్, లచ్చన్న, కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల మంచి కోరే ప్రభుత్వాన్ని వదులుకోవద్దు

- మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-తాండూర్

ప్రజల మంచి కోరి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్న టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని వదులుకోవద్దని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సోమవారం నియోజకవర్గంలో ఆహార శుద్ధి కేంద్రంతో పాటు 114కోట్ల89లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు, నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన నాటి నుండి తెలంగాణ ప్రజల సంక్షేమ కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉద్యోగ రూపకల్పనలో ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఐటీ మానవ వనరుల ఉపయోగంతో పరిశ్రమలను నెలకొల్పి ఉద్యోగ రూపకల్పనకు ప్రణాళికలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే బెల్లంపల్లిలో 20కోట్ల వ్యయంతో ఆహార శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. 350 ఎకరాల్లో నిర్మించనున్న ఈ ఆహార శుద్ధి కేంద్రం పూర్తయినట్లయితే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. మహిళా సంక్షేమ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. వారి సంక్షేమం కోసం లాభాల బోనస్‌ను 10 నుండి 30 శాతం పెంచామని తెలిపారు. 10లక్షల వడ్డీ లేని రుణాలను అందజేఅందజేయడం జరుగుతుందన్నారు. వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించి ప్రభుత్వం సింగరేణి కార్మిక కుటుంబాలకు చేయూతనందించిందని తెలిపారు. బిజెపి ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని తెలిపారు. వంట గ్యాస్‌తో పాటు చమురు ధరలు పెరగడంతో పేదలు కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితులు దాపురించాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వ హేతుబద్ధమైన చర్య వల్ల ఎల్ఐసి, ఓడరేవులు, ఉక్కు పరిశ్రమలు, సింగరేణి మైన్స్ ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్దపెల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, సక్కు, కోనప్ప, దివాకర్‌రావ్, రేఖానాయక్, ఎమ్మెల్సీ విఠల్, మంచిర్యాల గ్రంథాలయసంస్థ ఛైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, జడ్పి ఛైర్మన్ భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ సతీష్, జడ్పి వైస్ ఛైర్మన్, మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి పంచాయతీ కార్యదర్శుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు 11వ రోజు రోడ్లు ఊడ్చి, శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారంగా రిక్రూట్మెంట్ ద్వారా నియామకం పొంది ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారంగా మూడు సంవత్సరాల ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేసి ఏడాది గడుస్తున్నప్పటికీ ఇంకా ప్రభుత్వం కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. ఉద్యోగ భద్రత లేక అనివార్య పరిస్థితులలో దీక్షకు పూనుకున్నామని తెలిపారు. గ్రామపంచాయతీలలో దాదాపు 40 రకాల బాధ్యతలు నిర్వహిస్తూ ప్రతి పల్లెలో రోజువారి ప్రభుత్వ కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను, విపత్తు నిర్వహణ, పంచాయతీలో పరిశుభ్రత, అభివద్ధి మొదలగు అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పల్లెలు దేశంలోనే అభివృద్ధికి చిహ్నాలుగా గుర్తింపు తెచ్చిన క్షేత్రస్థాయి చిరుద్యోగులమైన తమ న్యాయమైన డిమాండ్ తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీల సంఘం జిల్లా అధ్యక్షుడు కష్ణ, నాయకులు ప్రదీప్ గౌడ్, శ్రావణ్ కుమార్ గౌడ్, ప్రణీత్, సంతోష్, చంద్రశేఖర్, మనీష్, జిల్లాలోని సెక్రటరీలు పాల్గొన్నారు.

జన్నారం : తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఉపసర్పంచులు సంఘీభావం తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం ఆవరణలో 11 రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను సోమవారం ఉప సర్పంచులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు బాలసాని శ్రీనివాస్‌గౌడ్, శ్రీపతి ఆనందం, జంగం రవి మాణిక్యం, ఒల్లాల నర్సాగౌడ్, పలు గ్రామాల ఉపసర్పంచులు, పాల్గొన్నారు.

హాజీపూర్ : మంచిర్యాల ఐబీ చౌరస్తాలో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక దీక్ష సోమవారం 11వ రోజుకు చేరుకుంది. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన జేపీఎస్, ఓపీఎస్‌లు పలు డిమాండ్లతో కూడిన ఫ్లకార్డులను పట్టుకుని శాంతియుత దీక్ష చేపట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నయీంపాషా, అనుచరులు రాజేందర్, సంతోష్, పవన్ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.





పంగిడి మాదర సమస్యలపై గ్రామస్తుల పాదయాత్ర



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తిర్యాణి మండలం పంగిడి మాదర గ్రామస్తులు సోమవారం గ్రామం నుండి జిల్లా కేంద్రం వరకు పాదయాత్ర నిర్వహించి కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడు పెందూరి మధుకర్ మాట్లాడుతూ ఉమ్మడి పంగిడి మాదర గ్రామపంచాయతీలో అనేక సమస్యలున్నాయన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సెల్ టవర్ వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ పరిధిలో దానాపూర్ మార్గంలోని రహదారి, అలాగే మోడీగూడ మీదుగా లింగాపూర్ వరకు ఉన్న రహదారికి వెంటనే అటవీ అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించాలన్నారు. మర్కగూడ నుంచి గోవేన వరకు రోడ్డు నిర్మించాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బుగ్గగూడ వద్ద బ్రిడ్జి వెంటనే పూర్తి చేయాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని చల్బలగూడ వాగుపై బ్రిడ్జి నిర్మించాలని, గ్రామంలో ఉన్న చెరువుకు కాలువ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు డిమాండ్ల పరిష్కారం కోసం పాదయాత్ర చేసినట్లు అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోకుంటే భవిష్యత్తులో ఉద్యమం ఉధతం చేస్తామని హెచ్చరించారు. పాదయాత్రకు ఆదివాసి సంఘ నాయకులు పెందురు దర్ము కొట్నాక గణపతి రావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు మడవి లక్ష్మణ్, నాయకులు గణపతి రావు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయివేట్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రైవేట్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన నిర్వహించిన డిపో ప్రైవేట్ డ్రైవర్ల యూనియన్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వారి సర్వీసులు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు అందిస్తున్న వేతనాల మాదిరి సమాన పనికి-సమాన వేతనం ఇవ్వాలన్నారు. 20 సంవత్సరాలుగా ఆర్టీసీలో చాలీచాలని వేతనాలతో ప్రైవేట్ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ యాజమాన్యం శ్రమ దోపిడీకి పాల్పడుతోందన్నారు. డ్రైవర్లకు ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. కేఎంపిఎల్ తీసుకురావాలని ఒత్తిడి తీసుకురాకూడదని, ఐదో తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, కార్మికులు మధుసుధన్, తాజ్ మియా, తేజ, మల్లేష్, సాయిక్రిష్ణ, శంకర్, దినేష్, బాసు, తిరుపతి, శేఖర్ పాల్గొన్నారు.



ప్రైవేట్ డ్రైవర్స్ అధ్యక్షునిగా మధుసూదన్ ఎన్నిక

ఆర్టీసీ డిపో అద్దె బస్సుల డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా మధుసూదన్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా బోగే ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా టి.దివాకర్, పిడుగు శంకర్, ఉపాధ్యక్షులుగా సోమ విజయకుమార్, షఫిక్, ప్రధాన కార్యదర్శిగా పి. తేజ, జాయింట్ సెక్రటరీగా గాజుల సాంబశివ ప్రసాద్, ఎస్.కె. తాజు మియా, కోశాధికారిగా సాయికృష్ణ ఎన్నికయ్యారు.

అక్రమ అరెస్టులకు ఖండన



నవతెలంగాణ-నస్పూర్

బెల్లంపల్లి, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం కేటీఆర్ పర్యటిస్తున్న సందర్భంగా పోలీసులు ఐఎఫ్‌టియు నాయకత్వాన్ని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి బ్రహ్మానందం తెలిపారు. బంగారు తెలంగాణ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలపై అనేక మంది ఉద్యమాలు చేస్తున్నారన్నారు. ఉద్యమాలు చేయనీయకుండా ఎంతకాలం ప్రజల గొంతు నొక్కుతారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సింగరేణి యాజమాన్యం అతి తక్కువ వేతనాలు చెల్లించడంతో కార్మిక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని, కెసిఆర్, కేటీఆర్ ఎన్నికల సందర్భంగా కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఈ ప్రాంతంలో ఎందుకు పర్యటన చేస్తున్నారో చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

బీజేపీ నాయకుల ఖండన

మంత్రి కల్వకుంట్ల తారక రామారావు బెల్లంపెల్లి పర్యటన సందర్భంగా బిజెపి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధి చేస్తున్నామని తిరిగే నాయకులను ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టు చేసి ఆపలేరని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలతో బిజెపి ప్రజల కోసం చేస్తున్న ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. ఎస్సీ మోర్చా నస్పూర్ మండల అధ్యక్షుడు సిరికొండ రాజు, బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా జనరల్ సెక్రెటరీ మిట్టపల్లి మొగిలి, యువ మోర్చా జిల్లా కార్యదర్శి కొంతం మహేందర్, నస్పూర్ మండల కార్యదర్శి కోరేపు మహేందర్, నాయకులు చింతకింది రవీందర్, ఇందూరు తిరుపతిని అరెస్ట్ చేశారు.

ఉద్యోగులు కార్పొరేట్ శాలరీ అకౌంటుగా మార్చుకోవాలి

నవతెలంగాణ నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అందరూ ఉద్యోగులు తమ బ్యాంకు శాలరీ ఖాతాలను కార్పొరేట్ శాలరీ అకౌంట్‌గా మార్చుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేట్ శాలరీ అకౌంట్ కలిగిన వారికి ఏదైన ప్రమాదం సంభవించినప్పుడు సంబంధిత బ్యాంకుల ద్వారా 40 లక్షల నుండి 62 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి, తమ శాలరీ అకౌంట్‌ను సంబంధిత బ్యాంకుల్లో సంప్రదించి కార్పొరేట్ శాలరీ అకౌంట్‌గా మార్చుకోవాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

నాలుగేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈజీఎస్‌లో క్షేత్రస్థాయి సహాయకులను తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం వారి పనిని కూడా పంచాయతీ కార్యదర్శులకు అప్పగించి పనిభారం పెంచిందని పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించారని, వెంటనే ప్రభుత్వం వారిని క్రమబద్ధీకరించాలని, వారి ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

దేవునిగూడలో స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే



నవతెలంగాణ-జన్నారం

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డ్ ప్రతిపాదిత గ్రామ పంచాయతీ అయిన దేవునిగూడలో సోమవారం అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం శిరీష గోపాలరెడ్డి, ఎంపిఓ రమేష్, జిల్లా సమన్వయకర్తలు మల్లేష్, రాజేందర్, ఏపీఎం బుచ్చన్న, ఉపసర్పంచ్ సుధాకర్, గ్రామైక్య సంఘం ప్రతినిధులు, ఆశా కార్యకర్తలు వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి జిల్లాకు రాక

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖా మంత్రి పురుషోత్తం రూపాల మంగళవారం జిల్లాకు రానున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా ఆయన కాగజ్‌నగర్‌కు వస్తున్నారని, స్థానిక పద్మశాలి భవన్‌లో ఉదయం 9 గంటలకు వివిధ వర్గాల ప్రజలు, కార్యకర్తలతో సమావేశమవుతారని తెలిపారు. అనంతరం ఆసిఫాబాద్‌లోని ఎస్‌ఎం గార్డెన్‌లో 11 గంటలకు నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు.

పిడుగుపడి పశువుల కొట్టం, వరి గడ్డి వాము దగ్ధం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని హాస్టల్ తండాలో సోమవారం సాయంత్రం ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో ఒక్కసారిగా పిడుగు పడడంతో బుక్య చందునాయక్‌కు చెందిన పశువుల కొట్టం దగ్ధమైంది. పిడుగు పాటుకు పెద్ద ఎత్తున మంటలు లేవడంతో పక్కన ఉన్న వరి గడ్డి వాము కూడా దగ్ధమైంది. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. విషయం తెలియగానే ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో సుమారు రూ.50వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

● ఎమ్మెల్యే అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్

నవతెలంగాణ-కడెం



మండలంలోని నవాబ్‌పేట్, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వమే పూర్తి ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు. తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఐకేపీ సీసీలు, మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సరీపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-నార్నూర్



గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీపై దృష్టి సారించాలని ఎంపీడీఓ కావల రమేష్ సూచించారు. సోమవారం మండలంలోని గంగాపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నర్సరీనీ సందర్శించారు. నర్సరీలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఎండకు మొక్కలు ఎండిపోకుండా రోజు క్రమం తప్పకుండా నీరు పోయాలని, నర్సరిని నిర్లక్ష్యం వహించవద్దని నిర్వాహకులను అదేశించారు. వారి వెంట సర్పంచ్ రూపదేవ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు నర్సరీ నిర్వహకులు ఉన్నారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్

ఐకేపీ వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.లలిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఐకేపీ వీఓఏలు చేపడుతున్న నిరవధిక దీక్షలు సోమవారంతో 20వరోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక కొండాపూర్ నుంచి జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.లలిత మాట్లాడారు. వీఓఏల సమస్యల పరిష్కారం కోసం దశలవారిగా పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. వీఓఏలతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే అసెంబ్లీ ముట్టడి చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి సాయన్న, వీఓఏలు ప్రభాకర్, గాయత్రి, సునీత, గంగజల, రజిత, గోవర్ధన్ పాల్గొన్నారు.

వయోవృద్ధులను ఆదరించాలి

నవతెలంగాణ-నిర్మల్

వయోవృద్ధులను ఆదరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో వయోవృద్ధుల పోషణ, ఫిర్యాదులకై వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించి మాట్లాడారు. నిరాదరణకు గురైన తల్లి దండ్రులు లేదా వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చూసుకోని పిల్లలపై ఆన్‌లైన్‌లో సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ కేసెస్ మానిటరింగ్ సిస్టం వెబ్‌పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే అప్పిలేట్ ట్రిబ్యునల్ కలెక్టర్‌కు కూడా ఫిర్యాదులు చేయవచ్చని అన్నారు. ఈ వెబ్‌పోర్టల్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదులు నమోదుచేసే క్రమంలో ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌లైన్ 14567కు కాల్ చేసి సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాంబాబు, జిల్లా సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, డీఆర్వో లోకేష్, ఆర్డీఓ స్రవంతి, తహసీల్దార్ సుభాష్, మున్సిపల్ కమిషనర్ రాజు, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజేశ్వర్‌గౌడ్, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆపద సమయంలో పోలీసులు తక్షణం స్పందించాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రజలకు ఆపద సమయంలో పోలీసులు తక్షణం స్పందించాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ప్రతి సోమవారం ప్రజాదివస్ కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేయాలని తెలిపారు. లేకపోతే జిల్లా వాట్సాప్ నెంబర్ 8712659599కు సమాచారం తెలపాలని కోరారు.

రైలు కిందపడి బాలిక ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు : రైలు కిందపడి మతిస్థిమితం లేని బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని డోర్లి రైల్వే గేటుకు కిలోమిటర్ దూరంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పల్సి(కె) గ్రామానికి చెందిన నైతం సౌజన్య(15) గిరిజన బాలిక సోమవారం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు సౌజన్య గత కొద్ది నెలల నుండి మతిస్థిమితం లేక తిరుగుతుండేదని తెలిపారు. కాగా సౌజన్య సోమవారం ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్లినట్లు గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపారు. మహారాష్ట్రలోని కిన్వాట్ నుండి అదిలాబాద్‌కు వస్తున్న ప్యాసింజర్ రైలు డోర్లి గేటుకు కిలోమీటర్ల దూరంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు.

అమ్మవారి సన్నిధిలో కేంద్ర మంత్రి

నవతెలంగాణ-బాసర : సరస్వతి దేవి అమ్మవారిని సోమవారం కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనను ఆలయ అధికారులు అర్చకులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభతో స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలోని ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలచే ఆలయ అర్చకుల ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపించి హారతినిచ్చి ఆశీర్వదించారు. అమ్మవారి చరిత్ర విశిష్టతను ఆయనకు వివరించారు. ఆలయ ఈఓ విజయరామారావు కేంద్రమంత్రిని పట్టు వస్త్రాలతో సత్కరించి అమ్మవారి ఫోటోలు ప్రసాదాలను అందజేశారు. వేద భారతి పీఠం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిని సత్కరించారు. వీరి వెంట నిర్మల్ జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షులు పడకంటి రమాదేవి, రామారావు పటేల్, మోహన్‌రావు పటేల్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

స్థానికులకే డీలర్ పోస్ట్‌ను కేటాయించాలి

నవతెలంగాణ-సిరికొండ : ఇటీవల కేటాయించిన రేషన్ డీలర్ పోస్టులను స్థానికులకే కేటాయించాలని రిమ్మ సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు అధికారులు మెరిట్ జాబితా ప్రకారం కాకుండా డీలర్ పోస్టులను, స్థానికులకు కాకుండా వేరే వాళ్లకి ఇష్టం వచ్చినట్లు పోస్టులను కేటాయించారని అన్నారు. ఆదివాసీలపై చిన్నచూపు చూస్తూ స్థానికులకు కేటాయించలేదని అన్నారు. ఉన్నతాధికారులకు ఇంతకు ముందు పిర్యాదు చేసిన పట్టించుకోకుండా కాలయాపన చేసి ఇప్పుడు స్థానికంగా లేని వారికి ఎలా డీలర్ పోస్టులను కేటాయిస్తారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరైన విచారణ జరిపి స్థానికులకు డీలర్ పోస్ట్ కేటాయించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

భూమిని దళిత రైతుకే ఇవ్వాలి

నవతెలంగాణ-నిర్మల్ :

దళిత రైతు భూమిని దళిత రైతుకు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా కనకాపూర్ గ్రామ దళితరైతు చేస్తున్న పోరాటం సోమవారం 43వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూతన్‌కుమార్ దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. లోకేశ్వరం మండల తహసీల్దార్, సర్వేయర్లు దళిత రైతు భూమిని సందర్శించారని తెలిపారు. గుట్ట భూమిని దళిత రైతుకు అంటగట్టాలని ప్రయత్నించినట్లు తెలిపారు. భూమిని ఆక్రమించిన వీడీసీ సభ్యులు రెడ్డి వర్గానికి చెందిన వారు కావడంతోనే అధికారులు భూమి ఇప్పించేందుకు ఊగిసలాడుతున్నారని ఆరోపించారు. దళిత రైతు సమస్యను పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని అన్నారు. వెంటనే అబ్దుల్లాపూర్ వీడీసీ సభ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, బాధిత దళిత రైతు కొబ్బనోళ్ల గంగన్న, కొబ్బనోళ్ల హంసబయి, కొబ్బనోళ్ల నవీన్ పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



రెండో ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో జిల్లా సెలక్షన్ కమిటీ ఆర్ఓఆర్ ప్రకారం నియమింపబడి రెండో ఏఎన్ఎంలు ఉద్యోగాలుగా సేవలందిస్తున్నామని అన్నారు. సుమారు 20 సంవత్సరాల నుండి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వైద్య ఆరోగ్యశాఖలో, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో ప్రతి ఒక్క పనిని ఏఎన్ఎంలు నిర్వహించారని గుర్తు చేశారు. చంటి పిల్లల నుండి మొదలుకొని వృద్ధుల వరకు వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని అర్హత కలిగిన ఏఎన్ఎం లందరినీ రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, నాయకులు అహల్య దేవి, లలిత, పుష్పలత, పుష్పల, ఆనందబాయి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ పాల్గొన్నారు.

ధాన్యంలో కోతలకు నిరసనగా రైతుల బైటాయింపు

● రోడ్డుపై రైతుల ధర్నా ● వివిధ పార్టీలు, సంఘాల నాయకుల మద్దతు



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

ప్రభుత్వం రైతులను దళారీలు మోసం చేస్తున్నారని, అలాంటి మోసాలకు గురికాకుండా చూడాలనే సంకల్పంతో దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులకు క్వింటాలుకు 8 కిలోలు అదనంగా తూకం వేస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం రైతులు, సంఘాలు, పార్టీల నాయకులు మార్కెట్ యార్డు ప్రధాన దారిలో బైఠాయించారు. ఈ సందర్భంగా ఎలాంటి కోతలు లేకుండా, మోసాలు చేయకుండా తూకం వేయాలని డిమాండ్ చేశారు. పాలు తప్ప పేరుతో నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. రైతుల రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోవడంతో వెంటనే ఘటన స్థలానికి ఇన్‌చార్జీ ఎస్సై రాజు, తహసీల్దార్ రాజమోహన్ చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. వారు వినకుండా భీష్మించుకు కూర్చుండటంతో వెంటనే సీఈఓ భూమి ఆశలన్నను పిలిపించారు. భూమి ఆశన్న 40 కిలోల బస్తాకు కిలో అదనంగా తూకం వేస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది. ఈ రాస్తారోకోలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, డాకూర్ తిరుపతి, నాగెల్లి నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దయానంద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ గంగా నర్సయ్య, నాయకులు సలీం, మండల రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్యదర్శుల సమ్మె

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. సోమవారంతో 11 రోజు చేరుకోగా మహిళా కార్యదర్శిలు బతుకమ్మ ఆడి తమ నిరసన తెలియజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన, ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని అన్నారు.

పలువురు మద్దతు..

సమ్మె శిబిరానికి డీటీఎఫ్ సంఘం నాయకులు వచ్చి తమ మద్దతుని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.నాగేందర్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి అభివృద్ధి పని వెనుక ఉన్నది జేపీఎస్, ఓపీఎస్‌లేనని అన్నారు. ప్రభుత్వం వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని తెలిపారు. అలాగే మరణించిన జేపీఎస్, ఓపిఎస్ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. తొడసం శ్రీనివాస్ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ డీటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యలే కాకుండా ఇతర సామాజిక సమస్యల కోసం కూడా పోరాడుతుందని పోరాటాల వల్లే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అలాగే తను స్వయంగా రచించి పాట పాడి జేపీఎస్‌లను ఉత్సాహపరిచారు. జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ జేపీఎస్, ఓపీఎస్‌లను ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా వెట్టి చాకిరి చేయిస్తోందని అన్నారు. ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వృకోదర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా జేపీఎస్, ఓపీఎస్‌ల సమ్మెకు డీటీఎఫ్ మద్దతు అన్ని విధాలా ఉంటుందని అన్నారు. అలాగే దేవుళ్ల నాయక్ తండ సర్పంచ్ రాథోడ్ సకారం దీక్షా శిబిరం వద్దకు వచ్చి సమ్మెకు మద్దతు తెలిపారు. అదేవిధంగా మాల సంక్షేమ సంఘం ప్రతినిధులు వచ్చి సమ్మెకి మద్దతు తెలిపారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అల్లూరి భూమన్న మాట్లాడుతూ జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు న్యాయబద్ధమైనవని అన్నారు. ప్రభుత్వం వెంటనే వీరిని రెగ్యులర్ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా నార్నూర్ మండల పరిషత్ అధ్యక్షులు కనక ప్రభాకర్ మాట్లాడుతూ పల్లె ప్రగతి, హరితహారం విజయవంతం కావడం వెనుక కార్యదర్శుల కృషి విశేషమైనది. పుట్టుక నుంచి మరణం వరకు ప్రతి పని పంచాయతీ కార్యదర్శి తోటే ముడిపడి ఉన్నదని అన్నారు. అనంతరం వివిధ గ్రామాల సర్పంచ్‌లు జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపారు.

రాష్ట్ర సంపదను కొల్లగొడుతున్న కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్ : తన కుటుంబం కోసం తెలంగాణ రాష్ట్ర సంపదను దోచుకుంటున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని కేంద్ర పాడి, మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. సోమవారం స్థానికంగా జరిగిన పార్లమెంటరీ ప్రవాస్ యోజన, కేంద్రప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలకు మేలు చేసే కిసాన్ సమ్మాన్, ఆయుష్మాన్ భారత్ పథకాలను కేసీఆర్ కుట్రపూరితంగా రాష్ట్రంలో అమలు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం రాష్ట్ర ప్రజలకోసం రూపాయి విడుదల చేస్తే కేసీఆర్ రాష్ట్రానికి పదిహేను పైసలనే ఇస్తున్నారని ఆరోపించారు. గతంలో విదేశీ ఉత్పత్తుల దిగుమతిపై ఆదారపడే స్థాయినుంచి భారత్ ఇప్పుడు మోడీ నాయకత్వంలో దిగుమతి చేసేస్థాయికి ఎదగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లీపూర్ శ్రీనివాస్, అయ్యన్నగారి భూమయ్య, రాథోడ్ రమేష్, సట్ల అశోక్, జానూభాయి, అమరవేణి నర్సాగౌడ్, పడాల శేఖర్, నాయిని సంతోష్ లాండేరి కిషన్, రమేష్‌గౌడ్, పరమేష్‌గౌడ్, మామిడాల సుధాకర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ ఫేస్-2పై అధికారులకు శిక్షణ



నవతెలంగాణ-సారంగాపూర్ :

అధికారులు స్వచ్ఛా భారత్ మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సర్పంచ్ లకు, ఎంపీటీసీలకు శిక్షకులు మధుమిత, అబుజర్‌లు స్వచ్ఛా భారత్ మిషన్ గ్రామీణ ఫేస్ 2 కార్యక్రమంపై శిక్షణ నిచ్చారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి రెండు ఇంకుడు గుంతలు, మురుగుదొడ్లు వాడకం వల్ల స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం కల్గుతుందని ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే ప్లాస్టిక్ రహిత గ్రామంగా నివారణ చర్యలు చేపట్టి గ్రామ పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం మాధురి సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ట త్మకంగా ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అద్యాల పద్మ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని తీర్యేల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరం ప్రారంభించారు. మునుపెన్నడు లేని విధంగా స్వరాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఊరికెళ్తే సమాచారం ఇవ్వాలి : సీఐ

నవతెలంగాణ - కౌటాల :

ఊరికెళ్తే సమాచారం ఇవ్వాలని సీఐ సాదిక్‌పాషా అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌటాల సర్కిల్ పరిధిలోని కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాల ప్రజలు ఎవరైన ఏదైన పనుల మీద వేరే గ్రామాలకు వెళ్లినట్టయితే ఇంటి పక్కన వారికి కానీ, పోలీసులకు కానీ సమాచారం అందించాలని పేర్కొన్నారు. రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు ఊరికెళ్తే ఇంటికి తాళం వేసి వెళ్లడం వల్ల దొంగలు చోరీకి పాల్పడే అవకాశముందన్నారు. ఊరికి వెళ్లే ముందు ఇంటిలోని విలువైన వస్తువులు బంగారం, నగలు వెంట తీసుకెళ్లడం లేదా బ్యాంకులో భద్ర పరుచుకోవడం మంచిదన్నారు. ప్రతి గ్రామంలో గ్రామస్తులందరు సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు జరిగినప్పటికీ దొంగలను త్వరగా పట్టుకొనే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపించిన, అనుమానాస్పదంగా ఎవరైన తిరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. జూదం, మట్కా, క్రికెట్ బెట్టింగులు, కోళ్ల పందేలు ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమాచారం కొరకు 8712670512 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీఆర్ఎస్‌కు దంతన్‌పల్లి సర్పంచ్ రాజీనామా

నవతెలంగాణ-ఉట్నూర్ :



సర్పంచ్ అయినప్పటికీ బీఆర్ఎస్ పార్టీలో గుర్తింపు లేకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు దంతన్‌పల్లి సర్పంచ్ భూమన్న తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్ రూపాంతరం చెందే వరకు పార్టీని నమ్ముకొని ఉన్నానని అన్నారు. రెండు సార్లు సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీగా మండలంలో పలు పదవులు చేసిన తనకు బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం గుర్తింపు ఇవ్వడం లేదని వాపోయారు. నియోజకవర్గంలో లంబాడ గిరిజనులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తు ఆదివాసీ నాయకపోడు, కొలాం తెగలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజీనామాను పార్టీ అధ్యక్షుడు జోగు రామన్నకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గతంలో నా భార్య అంకవ్వ ఎంపీటీసీగా పని చేసి సకల జనుల సమ్మెలో పాల్గొన్నప్పటికి పార్టీ ఆదివాసులను ఎదగనీయకుండ చేసిందని విమర్శించారు.

ఆలయానికి హుండీపెట్టె విరాళం

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్ :

శ్రీ రాజ్నాథ్ రాజరాజేశ్వర స్వామి, బద్ది పోచమ్మ ఆలయాలకు భక్తులు కానుకలు సమకూర్చేందుకు ఉపకరించే హుండీ పెట్టెని అమృత శంకర్ గౌడ్ దంపతులు విరాళంగా అందజేశారు. సోమవారం స్థానిక ఆలయంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో ఈ హుండీకి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయానికి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా హుండీ దాతలుగా నిలిచిన దంపతులను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మీ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు ఆడపిల్లలకు ఒక వరమని ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ అన్నారు. సోమవారం సోమవారం సాయంత్రం కేస్లాపూర్, వడ్‌గావ్, దస్నాపూర్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన 58 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులకు ఆడ పిల్ల భారం కాకూడదనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేపెట్టారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలు, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయడం హర్ష దాయకమని అన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఘనంగా వరల్డ్ రెడ్ క్రాస్ డే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు హ్యాంద్రు డునాట్ జన్మదినాన్ని పురస్కరించుకొని రెడ్ క్రాస్ సొసైటీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆదిలాబాద్‌లో ఘనంగా వరల్డ్ రెడ్ క్రాస్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్ రక్తనిది కేంద్రంలో పలువురు రక్తదానం చేసి వారి ఉదారతాను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఎన్నో సామాజిక కార్యాక్రమాలకు పెద్దపీట వేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. వరల్డ్ రెడ్ క్రాస్ డే సందర్భంగా 40కి పైచిలుకు సార్లు రక్త దానం చేసి, కరోనా సమయంలో వీరి విలువైన సమయాన్ని వెచ్చించి సేవ చేయడం, విరికివారే సాటి అని అన్నారు. సేవ మార్గంలో ముందుంటున్న దొంతుల ప్రవీణ్, శశికళ చౌహాన్‌లతో పాటు పలువురు రక్తదాతలను అభినదించారు. కార్యక్రమంలో బాలశంకర్ కృష్ణ, సామల ప్రశాంత్, మాసూద్, సిరాజ్, అల్తాఫ్ ఖాన్, అజీజ్, చరణ్, పెద్దివార్ శశికాంత్, కొరడే రాజు, గణేష్, అఖిల్ రెడ్డి, రవి, పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు

నవతెలంగాణ-తలమడుగు : గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు, ప్రభుత్వ కార్యక్రమాలకు తమను పిలవకుండా, నాయకులు, అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని సోమవారం భరంపూర్ సర్పంచ్ భగీర్థబాయి జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్‌కు ఫిర్యాదు చేశారు. తాను గిరిజన సర్పంచ్ కావడం వల్లనే ఎలాంటి సమాచారం అందించకుండా ప్రారంభోత్సవాలు శంకుస్థాపన చేస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులైనటువంటి మండల పరిధి, జిల్లా పరిషత్ ఐదు లక్షల నిధులతో వెంకటేశ్వర కొండపై వంట షెడ్డు నిర్మాణానికి గిరిజన సర్పంచిగా సమాచారం అందించకుండానే ప్రారంభోత్సవం చేశారని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు గిరిజన మహిళ సర్పంచ్ సమాచారం అందించక పోవడం పట్ల మండల అధికారులతో పాటు నాయకులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విపతిపత్రం అందజేశారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS : AT ADILABAD
ARB.NO. 48 Of 2023

Between :
M/s Brindavan Chits Karimnagar(India) Private Limited
Mancherial Branch, Represented by its Foreman ....Disputant

//AND//

MR.GUDDETI VISHWANATH & Others ....Opponents

To,
3. NALLANAGULA SUDERSHAN, S/o. DATTU RAM aged about 42 years, Occ: School Assistant, O/o.Z.P.S.S, Palsi, Kubeer(M), Nirmal Dist. R/o.H.No:3-6, Elegaon, Bhainsa(M), Nirmal Dist.

Take Notice that the above Dispute is filed against you and others for recovery of money, summons were issued on you, but you failed to receive the same, The above Dispute is **posted on 27/05/2023** for your appearance. On that day you have appear inperson at **11.00 A.M** Before the Deputy Registrar referred above otherwise the case will be decided ex-parte.

Sd/-
DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR, ADILABAD

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS : AT ADILABAD
ARB.NO. 51 Of 2023

Between :
M/s Brindavan Chits Karimnagar(India) Private Limited
Mancherial Branch, Represented by its Foreman ....Disputant

//AND//

MR. SHELKE PRAKASH & Others ....Opponents

To,
1.SHELKE PRAKASH, S/o. SHELKE AMRUTH aged about 37 years, Occ: Data Entry Operator, O/o. Divisional Sub Treasury, Bhainsa, Nirmal Dist. R/o. H.No.2-123, Pangri, Bhainsa, Nirmal Dist.
3.JADHAV VIKRAM NAIK, S/o.JADHAV AMBAJI aged about 30 years,Occ: Junior Assistant O/o. Assistant Director of Agriculture, Bhainsa, Nirmal Dist. R/o.H.No. 2-180/1, Buggaram Buzurg, Neredugonda (M), Adilabad Dist.

Take Notice that the above Dispute is filed against you and others for recovery of money, summons were issued on you, but you failed to receive the same, The above Dispute is **posted on 27/05/2023** for your appearance. On that day you have appear in person at **11.00 A.M** Before the Deputy Registrar referred above otherwise the case will be decided ex-parte.

Sd/-
DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR, ADILABAD

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS : AT ADILABAD
ARB.NO. 52 Of 2023

Between :
M/s Brindavan Chits Karimnagar(India) Private Limited
Mancherial Branch, Represented by its Foreman ....Disputant

//AND//

MR. MASKU SHANKAR & Others. ....Opponents

To,
1.MASKU SHANKAR, S/o. RAJAIAH aged about 57 years, Occ:Support Man, O/o:BPA, RKNT Incline, Srirampur Area, Mancherial Dist. R/o. H.No. SD-179, Srirampur Colony, Mancherial Dist.
2.THADICHETTY SAMPATH, S/o. RAYAMALLU aged about 39 years, Occ: General Mazdoor, O/o: RK-7 Incline, Srirampur Area, Mancherial Dist. R/o. H.No.3-19/1, Raghavapur, Karimnagar Dist.
3.KONKATI LAXMAN, S/o. POCHAIAH aged about 50years, Occ: General Mazdoor, O/o: RK-7 Incline, Srirampur Area, Mancherial Dist, R/o.H.No:14-551, RK6, Sai Nagar, Srirampur, Mancherial Dist.
4.DONTHULA SATHISH, S/o. ANKULU aged about 36 years, Occ: Genaral Mazdoor, O/o:RK-1 Incline, Mandamarri Area, Mancherial Dist, R/o.H.No:1-52, Kistampet, Chennur, Mancherial Dist.
5.GUNDARAPU RAMESH, S/o. NARSAIAH aged about 43 Years, Occ:Security Guard, O/o: S & PC, SRP, Srirampur Area, Mancherial Dist. R/o. Q.No.74A, Pranahitha Colony, Mandammarri(M), Mancherial Dist.

Take Notice that the above Dispute is filed against you and others for recovery of money, summons were issued on you, but you failed to receive the same, The above Dispute is **posted on 27/05/2023** for your appearance. On that day you have appear inperson at **11.00 A.M** Before the Deputy Registrar referred above otherwise the case will be decided ex-parte.

Sd/-
DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR, ADILABAD